నేడు సుజల స్రవంతిపై సదస్సు

సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: రాష్ట్రాన్ని కాపాడండి, దేశాన్ని రక్షించండి అనే నినాదంతో సీపీఐ ఈ నెల 17 నుండి సెప్టెంబరు 8వ తేదీ వరకు తలపెట్టిన బస్సు యాత్ర 19న అనకాపల్లి చేరుకుంటుందని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకట రమణ తెలిపారు. జిల్లా కేంద్రంలో గల పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 19న ఉదయం 10 గంటలకు న్యూ కాలనీలోని రోటరీ కళ్యాణ మండపంలో సుజల స్రవంతి నిర్మాణంలో జాప్యంపై సదస్సు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ బస్సు యాత్రలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శులు జేవీ సత్యనారాయణమూర్తి, ముప్పాళ్ల నాగేశ్వరరావు, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ తదితరులు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు కె.సన్యాసిరావు పాల్గొన్నారు.

పుట్టినరోజు వేడుకల పేరుతో బల ప్రదర్శన

- జన సమీకరణకు ఆరు కమిటీలు
- రాబోయే ఎన్నికల కోసమేనా...?
- కబ్జాల గోవిందా నయా కహాని
- చీదరించుకుంటున్న తెలుగు తమ్ముళ్లు

విశాలాంధ్ర బ్యూరో- అనకాపల్లి: నవ్విపోదురు గాక నాకేంటి సిగ్గు అనే స్థితికి కబ్జా గోవిందా అలియాస్ అవినీతి గోవిందా దిగజారి పోయారు అంటే అవుననే అంటున్నారు తెలుగు తమ్ముళ్లు. మాజీ ఎమ్మెల్సీ, జిల్లా పార్టీ అధ్యక్షుడు ఈమధ్య ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించుకుంటే చూసి ఓర్వలేక, తనకు అంత సీను లేకపోయినా ఆహ్వాన కమిటీ ఏర్పాటు చేసుకొని మరీ జన సమీకరణ చేసి జన్మదిన వేడుకలు చేసుకున్న కబ్జా గోవిందా వైఖరిని తెలుగు తమ్ముళ్లే చీదరించుకుంటున్నారు. గడిచిన నాలుగేళ్లగా ప్రతిపక్ష పాత్రలో ఘోరంగా విఫలమై, అడపాదడపా లంగా ఓణి ఫంక్షన్లకు హాజరవుతూ పార్టీ క్యాడర్‌కు నియోజకవర్గంలో దశ దిశ లేకుండా చేసి రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని తగుదునమ్మా అంటూ జన్మదిన వేడుకల పేరుతో బల ప్రదర్శనకు దిగిన మాజీ ఎమ్మెల్యే వైఖరిపై ఆ పార్టీ శ్రేణులే గుర్రుగా ఉన్నాయి. పార్టీలో గ్రూపులకు ఆజ్యం పోసి కరుడుగట్టిన పార్టీ కార్యకర్తలను విస్మరించి పిలిస్తే పట్టుమని పదిమందిని కూడా తీసుకురాలేని కొంతమంది వ్యక్తులను వెంట బెట్టుకుని పార్టీని నిలువునా ముంచేస్తున్నాడని కరుడుగట్టిన కార్యకర్తలు వాపోతున్నారు. లేని ఇమేజ్‌ను క్రియేట్ చేసుకోవడానికి జన్మదిన వారోత్సవాల పేరుతో వారం రోజులుగా జరిగిన తంతు.. తందానే తానే తందాన అన్నట్లు ఉందని తమ్ముళ్లు వాపోతున్నారు. పుట్టినరోజు వేడుకల నిర్వహణకు ఆరు కమిటీలను నియమించి జన సమీకరణకు, ఫ్లెక్సీలు, భోజనాలు ఏర్పాటుకు చేసిన హడావుడి అంత ఇంతా కాదని అంటున్నారు. జన్మదిన వేడుకల వేదిక సాక్షిగా కబ్జాల గోవిందా వండి వార్చిన వంటకం గాల్లో బూరెలు వేసినట్లే ఉందని తమ్ముళ్ళు అభిప్రాయ పడుతున్నారు.

కబ్జా గోవిందా నయా కహాపై తెలుగు తమ్ముళ్లు కూడా కామెడీ చేస్తున్నారు. వాపు చూసి బలుపు అనుకునే స్థాయికి దిగజారిన కబ్జా గోవిందా వైఖరిపై తెలుగు తమ్ముళ్లు జోకులు వేసుకుంటున్నారు. వచ్చే ఎన్నికల్లో పొత్తుపొడిస్తే పొత్తులో భాగంగా టికెట్ కోల్పోతే కబ్జా గోవిందు పరిస్థితి గోవిందా ...గోవిందా..

గంగవరం పోర్టు యాజమాన్యం దిగి రావాలి: సీపీఐ

విశాలాంధ్ర - పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టు కార్మికులు గత 46 రోజులుగా కనీస వేతనాలు కోసం దీక్షలు చేపడుతున్నప్పటికీ పోర్టు యాజమాన్యంలో చలనం లేదని సీపీఐ గాజువాక నియోజకవర్గం కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం గంగవరం పోర్టు కార్మికులు చేపడుతున్న దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ చాలీ చాలని జీతాలతో పోర్టు కార్మికులు జీవనాన్ని సాగిస్తున్నారని వారి అభ్యున్నతికి కృషి చేయాల్సిన యాజమాన్యం ఆంక్షలు పెట్టడం సరి కాదన్నారు. తక్షణమే అదానీ గంగవరం పోర్టు యాజమాన్యం దిగి వచ్చి కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షల్లో ఏఐటీయూసీ నాయకులు జి.ఆనంద్, వి.దుర్గారావు, పల్లెటి పోలయ్య పాల్గొన్నారు.

బీఎల్ఓలపై కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు

విశాలాంధ్ర - వి.మాడుగుల: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా మాడుగుల గ్రామంలో ఇప్పటి వరకు ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమంలో బీఎల్‌ఓలు పూర్తిగా విఫలమయ్యారని మాడుగుల పట్టణ టీడీపీ అధ్యక్షులు రంజిత్‌వర్మ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విషయమై కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ పుప్పాల రమేష్, యూనిట్ ఇన్‌చార్జ్ లెక్కల కాశిబాబు, బూత్ ఇన్‌చార్జిలు పిఎస్ఎన్.రాజు, సర్వరావు, డి.నానాజీ, కె.సూర్యజగన్నాధరావు, జి.మణికంఠ, బి.నాయుడు, పి.రామచంద్రమూర్తి, సిహెచ్.మూర్తి, సీనియర్ నాయకులు పైడినాయుడు, రాంబాబు, ఎం.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తులు

విశాలాంధ్ర - డుంబ్రిగుడ: మండలంలోని వివిధ పంచాయతీల్లో ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్త, సహాయకురాలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు స్థానిక ఐసీడీఎస్ సీడీపీఓ నీలవేణి తెలిపారు. సొవ్వ పంచాయతీలోని పనస వలస, దేవుడు వలస, అరమ పంచాయతీలోని జూర్రి పాడు, కించమండ పంచాయతీలోని కించమండ అంగన్వాడీ కేంద్రం, అరకు పంచాయతీ అరకు అంగన్వాడి కేంద్రంలోని కార్యకర్తల పోస్టుల భర్తీతోపాటు మరో మూడు అంగన్వాడీ సహాయకురాల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆమె తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు స్థానికులు అయి ఉండాలని, పదో తరగతి ఉత్తీర్ణత తప్పనిసరని, 01/07/2023 నాటికి 21 నుండి 35 ఏళ్ల వయసులోపు ఉండాలని ఆమె సూచించారు. 25వ తేదీ లోపు దరఖాస్తులు స్థానిక సీడీపీఓ కార్యాలయంలో అందించాలన్నారు.

గాయపడ్డ కార్మికులకు పరామర్శ

విశాలాంధ్ర - అనకాపల్లి: బ్రాండిక్స్ బస్ ప్రమాదంలో గాయపడి అనకాపల్లి ఉష ప్రైమ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులను ఏఐటీయూసీ, బీఎస్పీ, ఆమ్ ఆద్మీ, సీపీఐ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు కోన లక్ష్మణ, బీఎస్పీ నాయకులు సూదికొండ మాణిక్యాలరావు, ఆమ్ ఆద్మీ నాయకులు కోణతాల హరినాథ్ బాబు, సీపీఐ నాయకులు భద్రం మాట్లాడుతూ బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. డ్రైవర్లకు తగినంత విశ్రాంతి లేకపోవడం వలన వేగంగా ప్రయాణాలు చేయడం వలన ఈ ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. గాయాలు మానేవరకు వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన శ్రామిక యూనియన్ నేత కొల్లి సత్యారావు పాల్గొన్నారు.

నేడే కొరుప్రోలు సర్పంచ్ ఉప ఎన్నిక

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలో కొరుప్రోలు సర్పంచ్ ఉప ఎన్నికల ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలోని కొరుప్రోలు గ్రామంలో కొద్ది నెలల క్రితం సర్పంచ్ పోలవరపు లోవ లక్ష్మి అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో ఉప ఎన్నికల కోసం ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేశారు. దీనికి సంబంధించి టీడీపీ తరఫున కర్రి సూర్యవేణి, వైసీపీ తరఫున పోలవరపు హేమ బరిలో నిలిచారు. లింగరాజుపాలెం గ్రామంలో ఐదవ వార్డు ఉప ఎన్నికకు ఏర్పాటు చేశారు. శనివారం జరిగే ఎన్నికల సందర్భంగా నక్కపల్లి సీఐ అప్పన్న ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేయగా ఐదుగురు ఎస్సైలు, సుమారు 30 మంది సిబ్బందిని నియమించినట్లు ఎస్సై పొన్నాడ ప్రసాదరావు తెలిపారు.

సీపీఐ బహిరంగ సభను జయప్రదం చేయండి

అల్లూరి జిల్లా కార్యదర్శి సత్యనారాయణ

విశాలాంధ్ర - చింతపల్లి: రాష్ట్రాన్ని రక్షించండి... దేశాన్ని కాపాడండి అనే నినాదంతో సీపీఐ తలపెట్టిన ప్రచార జాత బస్సు యాత్రను, ఆ క్రమంలో ఆదివారం చింతపల్లి కేంద్రంగా నిర్వహించ తలపెట్టిన భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఐ అల్లూరి జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ అన్నారు. శుక్రవారం చింతపల్లి వచ్చిన ఆయన ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు షేక్ రెహమాన్ (బుజ్జి), మాజీ ఉప సర్పంచ్ గంజారి రమణలతో కలిసి మాట్లాడారు. బస్సు యాత్ర ఆదివారానికి చింతపల్లి చేరుకుంటుందని రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణతో పాటు ఇతర ముఖ్య నాయకులు హాజరవుతారని తెలిపారు. అధిక సంఖ్యలో జనం తరలిరావాలని పిలుపునిచ్చారు.

బ్రాయిలర్ ఇండస్ట్రియల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొట్యాడ

విశాలాంధ్ర - ఆనందపురం: బ్రాయిలర్ ఇండస్ట్రియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన విశాఖ జిల్లా అధ్యక్షుడిగా ఆనందపురం గ్రామ పంచాయతీకి చెందిన కొట్యాడ శ్రీనివాసరావును శుక్రవారం పెద్దిపాలెం కింగ్స్ ఫంక్షన్ హాల్‌లో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రైతు సోదరులకు నష్టం లేకుండా ఆంధ్ర ప్రదేశ్ మొత్తంగా రైతులకు మేలు చేసే విధంగా పెద్దలు, సలహాలు సూచనలతో ముందుకు వెళతానని అన్నారు. రైతును ప్రోత్సహిస్తే ట్రేడర్స్ వ్యాపారం ఇంకా అభివృద్ధి చెందుతుందని అన్నారు. వైస్ ప్రెసిడెంట్‌గా షేక్ ఫీర్ సాహెబ్, సెక్రటరీ చిట్టూరి రామకృష్ణ, జాయింట్ సెక్రెటరీ బి.సతీష్, ట్రెజరర్ ఎస్ఎన్ మాధవరావు, ఫార్మర్ మెంబర్‌లు కృష్ణమూర్తి, కొణితాల గోపి, రమేష్, కోరాడ రమణ, ట్రేడర్స్ మెంబర్లు సుబ్బారావు, శుభాన్, సుధా శ్రీను, లతా శ్రీను, సత్యనారాయణ, సీనియర్ ఫార్మసీ సీఈవో మేక నాగేశ్వరరావు, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంపురం పంచాయతీ వార్డు సభ్యుని ఉప ఎన్నిక బరిలో ఇద్దరు

బత్తిన నాగేశ్వరరావు

మేడిశెట్టి నూకరాజు

విశాలాంధ్ర - పాయకరావుపేట: మండలంలోని శ్రీరాంపురం పంచాయతీ 8వ వార్డుకు ఉప ఎన్నిక శనివారం జరగనుంది. వార్డు సభ్యులుగా ఉన్న వాసంశెట్టి శేషారావు వార్డు సభ్యుని పదవికి రాజీనామా చేయడంతో ఇక్కడ ఎన్నిక అనివార్యమైంది. వార్డు సభ్యుని పదవికి మొత్తం 3నామినేషన్లు దాఖలు కాగా ఒకరు విత్‌డ్రా అయ్యారు. దీంతో ఎన్నికల బరిలో బత్తిన నాగేశ్వరరావు, మేడిశెట్టి నూకరాజు మధ్య పోటీ నెలకొంది. వార్డు పరిధిలో మొత్తం 266 ఓట్లు ఉన్నాయి. ఉదయం 7గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు పోలింగ్ జరగనుంది. 2గంటల నుండి ఓట్ల లెక్కింపు జరుగుతుంది. అనంతరం ఫలితాలు వెల్లడిస్తారు. పోలింగ్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీఓ సాంబశివరావు తెలిపారు.

రేవంత్ కుమార్‌కు సన్మానం

విశాలాంధ్ర - తగరపువలస: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 373వ జయంతిని ఆంధ్రప్రదేశ్ యాత సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆనందపురం మండలం గంభీరం పంచాయితీ కొత్తూరు యాత పేట గ్రామంలో నిర్వహించారు. రాష్ట్ర యూత సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులు అంగటి రాము, రాష్ట్ర యాత కార్పొరేషన్ డైరెక్టర్ బాడిత బోయిన రాములప్పుడు, విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు చిట్టి బోయిన రాము, గంభీరం కల్లుగీత సొసైటీ ప్రెసిడెంట్ గండి బోయిన రమణ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ బడుగు బలహీన వర్గాల కోసం పోరాడిన యోధుడని కొనియాడారు. ఆనందపురం గ్రామానికి చెందిన కుప్ప రేవంత్ కుమార్ కరాటేలో జిల్లా స్థాయి రాష్ట్ర స్థాయిలో పథకాలు సాధించినందుకు గాను సన్మానించి ట్రోఫీని అందించారు. ఈ కార్యక్రమంలో జై జవాన్ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్, గంబీరం కల్లు గీత సొసైటీ సెక్రటరీ గండిబోయిన అప్పలరాజు పాల్గొన్నారు.

వేములవలసలో టాటా మోటార్స్ సర్వీసింగ్ సెంటర్ ప్రారంభం

విశాలాంధ్ర - భీమిలి: ఆనందపురం మండలంలోని వేముల వలస గ్రామ పంచాయతీ పరిధిలో భీమిలి క్రాస్ రోడ్ దగ్గర జెఎస్ పేర్ ఇండస్ట్రియల్ ప్రైవేట్ లిమిటెడ్ నూతనంగా టాటా మోటార్స్ సర్వీసింగ్ సెంటర్‌ను ప్రారంభించింది. విజయనగరం, విశాఖ పట్నం చుట్టుపక్కల పరిసర ప్రాంతాల్లో సర్వీస్ కొరకు నూతన టెక్నాలజీతో కస్టమర్లకు నూతన విధానం అందిస్తున్నామని డైరెక్టర్ సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో టాటా మోటార్స్ సిఎక్స్ ఎం.దారకేస్, విశాఖపట్నం సేల్స్ జిఎం సాయి, సర్వీస్ జిఎం పటాన్, జ్యోతి సుధాన్, వంతం గురవయ్య, పి.శ్రీనివాసరావు, టాటా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - యలమంచిలి: మండలంలో పద్మనాభరాజు పేట గ్రామంలో ఉన్న శ్రీ దుర్గాదేవి అమ్మవారి ఆలయంలో శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రత్యేక అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. శ్రావణమాసం మొదటి శుక్రవారం కావడంతో పద్మనాభరాజుపేట, బయ్యవరం ఉభయ గ్రామాలతో పాటు ఇతర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి దుర్గాదేవి అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. మధ్యాహ్నం, రాత్రి ఆలయం వద్ద మహిళలు ప్రత్యేక హరి భజనలు నిర్వహించారు. సర్పంచ్ గొన్నా బత్తుల శివలక్ష్మి, శివ దంపతులు, మాజీ వైస్ ఎంపీపీ గొన్నాబత్తుల నాగేశ్వరరావు, సూర్యకళ దంపతులు, నాయకులు జెత్రిపోతుల వెంకటరావు, లక్ష్మి దంపతులు, గోవిందరావు దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వూటకూటి శేఖర్, కమిటీ సభ్యులు మొగ్గ బుజ్జి, జెత్రిపోతుల నానాజీ, రాయవరపు వెంకట్, మొల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీఈఆర్సీ క్యాంపు కార్యాలయం ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విద్యుత్ వినియోగదారుల సమస్యలు తెలియజేసేందుకు ఆంధ్ర ప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) క్యాంపు కార్యాలయాన్ని విశాఖపట్నంలోని ఏపీఈపీడీసీఎల్ ప్రధాన కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఏపీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఏపీఈఆర్సీ సభ్యులు ఠాకూర్ రామ్ సింగ్, వి.వెంకట్రామరెడ్డి, ఏపీఈపీడీసీఎల్ సిఎండి పృథ్వీతేజ్ ఇమ్మడి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాల విద్యుత్ వినియోగదారులకు అందుబాటులో ఉండేందుకు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించామని తెలిపారు. ఏపీట్రాన్స్‌కో, ఏపీ డిస్కమ్స్ సమర్పించిన రిసోర్స్ ఇన్వెస్ట్మెంట్ ప్లాన్‌కు సంబంధించిన 5వ, 6వ కంట్రోల్ పీరియడ్‌పై ఏపీఈఆర్సీ శనివారం ఈ క్యాంపు కార్యాలయంలోనే విచారణ కార్య క్రమాన్ని నిర్వహించనుందని తెలిపారు. ఈ కార్య క్రమంలో ఈపీడీసీఎల్ డైరెక్టర్లు డి.చంద్రం, బి.రమేష్ ప్రసాద్, ఎ.వి.వి.సూర్యప్రతాప్, సిజిఆర్ఎఫ్ చైర్ పర్సన్ బిసత్యనారాయణ, సంస్థ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ ఏ.వి.ఎల్.ప్రసన్నకుమార్, సీజీఎంలు వి.విజయలలిత, డి.సుమన్ కళ్యాణి, అచ్చి రవికుమార్, ఓ.సింహాద్రి, ఎస్.మసిలామని, జె.శ్రీనివాసరావు, బి.రామ చంద్ర ప్రసాద్, ఎం.రామకృష్ణ, ఏ.వెంకటేశ్వరరావు, ఎం.రవీంద్ర, పి.శ్రీనివాస్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విమానాశ్రయం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి: కలెక్టర్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఎయిర్ పోర్ట్ పరిసరాలు, పర్యావరణం పరిశుభ్రంగా ఉండేలా తగు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టరు డా. ఎ.మల్లిఖార్జున అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విశాఖపట్నం ఎయిర్‌ఫీల్డ్ నుండి వైమానిక కార్యకలాపాలలో ఎదురవుతున్న సవాళ్లను తెలుసుకోవడానికి సివిల్ అడ్మినిస్ట్రేషన్, ఇండియన్ నేవీ, పోర్ట్ ట్రస్ట్, జీవిఎంసి, ఎయిర్ పోర్ట్ అథారిటీ ప్రతినిధులతో ఎయిర్‌ఫీల్డ్ ఎన్విరాన్‌మెంట్ కమిటీ సమావేశాన్ని జీవీఎంసీ కమిషనర్ సిఎం సాయి కాంత్ వర్మతో కలిసి నిర్వహించారు. రన్ వేలో నీటి నిల్వ, పరిసరాలలో చెత్త డంపింగ్, పక్షుల కార్యకలాపాలు పెరగడానికి కారణం తదితర అంశాలపై చర్చించారు. జాతీయ రహదారి ప్రాంతంలో కోళ్ళు, మేకలు మాంసపు వ్యర్థాలు మేఘాద్రి గెడ్డ కాలువలో అక్రమంగా వేస్తున్నారని చర్యలు తీసుకోవాలన్నారు. ఎయిర్ పోర్ట్ ప్రాంగణంలో నీటి నిల్వకు గల కారణాలను ఇరిగేషన్ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అంతర్గతంగా ఉన్న మూడు డ్రైనేజీ కాలువలను సవ్యంగా నిర్వహణ చేయాలని ఎయిర్ పోర్ట్ అథారిటీకి సూచించారు. కార్యక్రమంలో ఐఎన్ఎస్ డేగ కెప్టెన్ రాజ్ కుమార్ పొదర్, విమానాశ్రయ డైరెక్టర్ ఎస్.రాజారెడ్డి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, పోర్ట్ ట్రస్ట్ సిబ్బంది, జీవిఎంసి ,ఇరిగేషన్ మొదలగు సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మతిభ్రమించిన ముఖ్యమంత్రితో మాకేంటి కర్మ

మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

విశాలాంధ్ర - గొలుగొండ: ఈ రాష్ట్రాన్ని పట్టిపీడిస్తున్న జగన్మోహన్ రెడ్డికి ప్రజలు చరమగీతం పాడే రోజులు వచ్చాయని మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు అన్నారు. మండలంలో ఏఎల్ పురం మేజర్ పంచాయతీలో అయ్యన్న సమక్షంలో సుమారు 120 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వీధి వీధికి సిమెంట్ రోడ్లు, ఇంటింటి కుళాయిలు, 24 గంటలు కరెంటు లాంటి ఎన్నో కార్యక్రమాలు టీడీపీ హయాంలోనే జరిగాయని ఈ జగన్మోహన్ రెడ్డికి దోచుకోవడం దాచుకోవడం తప్ప ఇక ఏమీ తెలియదని అన్నారు. 25 రూపాయలు విలువ చేసే మద్యం సీసాను 250 రూపాయలకు అమ్ముకొని ప్రజాధనాన్ని కోట్లలో దోచేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎల్ పురం రెండవ సెగ్మెంట్ ఎంపీటీసీ రుత్తల శివరామకృష్ణ, యూపీ స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ గొర్లి లక్ష్మణరావు, 9వ వార్డు మెంబర్ నాగార్జున, ఏ ఎల్ పురం మాజీ సర్పంచ్ కుందూరు అప్పారావు, కుందూరు దొంగ బుల్లి, పాత కృష్ణ దేవి పేట నుండి పుట్ట సూర్యప్రకాష్, నాగాపురం నుంచి సేనాపతి వరహాల బాబు తదితరులు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసి చిటికెల తారక వేణుగోపాల్, మాజీ ఎంపీటీసీ చింతల నారాయణమూర్తి నాయుడు, అడిగర్ల అప్పలనాయుడు, చిటికెల సాంబమూర్తి, కొల్లూ రాంబాబు, చోద్యం సర్పంచ్ ఆయుధపరెడ్డి గోపాలకృష్ణ పాల్గొన్నారు.

రూ.1.6 కోట్లతో అప్పన్న ధ్వజస్థంభానికి బంగారు తాపడం

విశాలాంధ్ర - సింహాచలం: సింహాచలేశుని ఆలయానికి బంగారు తళుకులు సింగారించేందుకు దేవస్థానం అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. సుమారు రూ.కోటి అరవై లక్షల రూపాయల వ్యయంతో అప్పన్న స్వామి ధ్వజస్థంభం పొడవు 42 అడుగులు, చుట్టు కొలత 360 చదరపు అడుగులు, ఒక చదరపు అడుగుకు 5 గ్రాములు బంగారంను ధ్వజస్తంభ రాగి తాపడంపై స్వర్ణపూత పనులు చేయించేందుకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయని ఈఈ రాంబాబు తెలిపారు. నగరానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త ధ్వజస్తంభం స్వర్ణ మయానికి ముందుకు వచ్చారని సుమారు 1.5 కిలోల బంగారం వినియోగించి ధ్వజస్తంభానికి బంగారు రేకును తాపడం చేయించేందుకు సన్నద్ధమయ్యామని ఇన్‌చార్జి ఈఓ త్రినాధరావు తెలిపారు. ఆలయ ద్వారాలు రజత మయం సింహాద్రి నాథుడి ఆలయ ముఖద్వారం, నీలాద్రి గుమ్మం వద్ద ఉన్న ద్వారాలు పురాతనమైనవి కావడంతో కొన్నేళ్ల క్రితం నూతనంగా తయారు చేయించి పునరుద్ధరించారు. పాత తలుపులకు ఇత్తడి రేకు తాపడం చేసి ఉండేది. అదేవిధంగా దాతలు ముందుకు వస్తే త్వరలో నీలాద్రి గుమ్మం ద్వారాలకు స్వర్ణ రేకులను అమరుస్తామని ఏఈఓ సూర్య భ్రమరాంబ, పర్యవేక్షకులు సునిల్, ప్రధాన అర్చకులు జి.శ్రీనివాసాచార్యులు, స్థానాచారులు టి.పి.రాజగోపాల్, అలంకారి కరి సీతారాం, ఎగ్జైజర్ సాంబ, పాలక మండలి సభ్యులు అంటున్నారు.

పవన్ కళ్యాణ్ దృష్టికి హెటిరో సమస్య

విశాలాంధ్ర - నక్కపల్లి: మండలంలో రాజయ్యపేట గ్రామంలో హెటిరో కంపెనీ వేస్తున్న కొత్త పైపులైన్ తొలగించాలని, వాటికి భవిష్యత్తులో అనుమతులు ఇవ్వకూడదని, 400 ఎకరాల ఉప్పుటేరులో విష వ్యర్థా జలాలను వదలకూడదని మత్స్యకారులు 620 రోజులుగా చేపడుతున్న మహా శాంతియాత్ర ధర్నాలో భాగంగా రాజయ్యపేట గ్రామానికి చెందిన కొంతమంది మత్స్యకారులు విశాఖపట్నంలో శుక్రవారం జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ విశాఖపట్నం (రూరల్) ప్రోగాం కమిటీ మెంబర్, ఆంధ్ర మత్స్యకార జేఏసీ రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ పిక్కి స్వామి విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయంపై పవన్ వద్ద వెళ్లబోసుకోగా తప్పకుండా పాయకరావుపేట నియోజకవర్గంలో వారాహి యాత్రకు వచ్చేటప్పుడు వస్తానని హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో గోసాల సోమేశ్వరరావు, వాసపల్లి నూకరాజు, చింతకాయల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

స్పందన సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టండి

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా వ్యాప్తంగా స్పందన కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదుల సమస్యల పరిష్కాంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాసు, ఐటీడీఏ పీఓ వి.అభిషేక్‌తో కలిసి శుక్రవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందనలో వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీ దారుల నుండి 135 ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదులను 24 గంటల్లో పరిశీలించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు.

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలి

విశాలాంధ్ర - ముంచింగిపుట్టు: మండలంలో గల గిరిజన సంక్షేమ బాలురు బాలికల పాఠశాలలో మధ్యలో బడి విడిచిపెట్టిన పిల్లలను తిరిగి బడుల్లో చేర్పించేందుకు మండల పరిధిలో గల స్కూల్ కాంప్లెక్స్‌ల వారిగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఆర్వీఎస్ రమేష్ తెలిపారు. శుక్రవారం స్థానిక గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల 1 ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. మండలంలో గల గిరిజన సంక్షేమ ఆశ్రమ బాల బాలికల పాఠశాలలు 15 వరకు ఉన్నాయని వీటిలో బడి మానేసిన పిల్లలను తిరిగి చేర్పించాలని అన్నారు. ఈ కార్యక్రమాన్ని 10 రోజులపాటు నిర్వహిస్తామన్నారు. కుటుంబ సభ్యులతో ఫోనులో సంప్రదించాలని, ఫోన్ సౌకర్యం లేకపోతే ఆయా గ్రామాలకు వెళ్లి వివరాలు సేకరించి బడిలో చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

918వ రోజుకు ఉక్కు దీక్షలు

విశాలాంధ్ర - కూర్మన్న పాలెం: విశాఖ పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న ఉక్కు దీక్షలు 918వ రోజుకు చేరుకు న్నాయి. సింటర్ ప్లాంట్ కార్మికులు పాల్గొన్నారు. వారిని ఉద్దేశించి పోరాట కమిటీ సభ్యులు జె.అయోధ్యరామ్, వరసాల శ్రీనివాసరావు, జె.రామకృష్ణ, యు.రామస్వామి మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగ పరిశ్రమగా కొనసాగించే వరకు భారీ పోరాటం నిర్వహిస్తా మని స్పష్టం చేశారు. ఈ రిలే నిరాహార దీక్షలో యు.వెంకటేశ్వరరావు, టి.శ్రీనివాస్, జె.వెంక టేశ్వరరావు, డి.ఎస్.ఆర్.మూర్తి, పట్ట రమేష్, మహేష్, కె.బాబురావు పాల్గొన్నారు.

ప్రభుత్వ సలహాదారు దృష్టికి పలు సమస్యలు

విశాలాంధ్ర - అనంతగిరి: సచివాలయ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి దృష్టికి ఎంపీపీ శెట్టి నీలవేణి తీసుకువెళ్లారు. సచివాలయాల్లో సాంకేతికపరమైన కారణాలతో కొన్ని సమస్యలను పరిష్కరించలేకున్నామని వాటిని పరిష్కరించే దిశగా చర్చలు జరుపుతున్నామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఆమెతోపాటు కోఆప్షన్ సభ్యుడు షేక్ మదీనా, వైసీపీ కార్యకర్త పైడితల్లి, సీనియర్ పాత్రికేయులు చందు, ఉపాధ్యాయులు కమిడి ప్రసాద్, సచివాలయ ఉద్యోగి సుభ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కుంభా రవిబాబుకి శుభాకాంక్షలు

విశాలాంధ్ర - అనంతగిరి: గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నియమితులై శుక్రవారం శాసనమండలిలో ప్రమాణ స్వీకారం చేసిన డాక్టర్ కుంభ రవిబాబుకు అనంతగిరి వైసీపీ కుటుంబ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. శాసన మండలిలో ప్రమాణ స్వీకారం అనంతరం విజయవాడ కళా క్షేత్రంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయనను కలిసి పుష్పగుచ్చాలతో శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనంతగిరి మండల అధ్యక్షురాలు శెట్టి నీలవేణి, వైస్ ఎంపీపీ దూరు జయవర్ధిని, ఎస్టీ కమిషన్ సభ్యురాలు కొర్రా రామలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు జయశ్రీ, అశోక్, తవిటి నాయుడు, కో ఆప్షన్ సభ్యుడు షేక్ మదీనా, పాంగి అప్పారావు, పెంటమ్మ, భీమాలమ్మ, రంజీవి, గణేష్, సన్యాసిరావు, వైసీపీ మండల అధ్యక్షులు శెట్టి ఆనందు, మాజీ జెడ్పీటీసీ దూరి గంగన్న దొర, మాజీ వైస్ ఎంపీపీ దుర్యో రుక్మిణి, రంశాల, రామన్న దొర, దురియా సత్యనారాయణ, రూడ్ సత్యనారాయణ పాల్గొన్నారు.

విశాలాంధ్ర
→ విశాఖపట్నం
→ అనకాపల్లి
→ అల్లూరి సీతారామరాజు
శనివారం 19, ఆగస్టు, 2023

శ్రీప్రకాష్‌లో వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - పాయకరావుపేట: స్థానిక శ్రీప్రకాష్ విద్యాసంస్థల 47వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రీప్రకాష్ విద్యాసంస్థల్లో చదువుకుంటున్న విద్యార్థుల్లో జూనియర్, సీనియర్ విభాగాల్లో గాతా రహే మేరా దిల్ పేరిట పాటల పోటీలు నిర్వహించారు. ఈకార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా ప్రముఖ గాయకులు సుప్రీమ్ శేఖర్, ప్రముఖ కీబోర్డు ప్లేయర్ జి.రామారావు హాజరయ్యారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎంవివిఎస్ మూర్తి, కన్వీనర్ సీతారాణి, ఏపీపీఎస్సి సభ్యులు సోనివుడ్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉద్యోగుల గ్రీవెన్స్‌కు 28 వినతులు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ కె.ఎస్ విశ్వనాథన్ స్పష్టం చేశారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం ఉద్యోగుల సమస్యలపై ఉద్యోగుల గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించి వారి నుంచి జాయింట్ కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. 28 వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ శ్రీనివాసమూర్తి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ ఖురానాతో ప్రచారాన్ని ఆవిష్కరించిన అమేజాన్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: విలక్షణ బాలీవుడ్ స్టార్ ఆయుష్మాన్ ఖురానా అమెజాన్ వారి బ్రాండ్ అమెజాన్ పే కోసం కొత్త కాంపైన్ 'బిల్ పేమెంట్స్ కా స్మార్టర్ వే' కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆలస్యపు జరిమానాలు, జరిమానాలను నివారించడంలో సహాయపడే తమ బిల్లుల కోసం సకాలంలో చేసే రిమైండర్‌లతో - కస్టమర్‌లు తమ బిల్స్ అన్నింటినీ ఒకే చోట నిర్వహించే ఆధునిక కాలానికి చెందిన పద్ధతిని ఏ విధంగా ఆనందించాలని ఆలోచనను ప్రధానంగా ఈ కాంపైన్ ప్రచారం చేస్తుందనీ అమెజాన్ ప్రైమ్ మార్కెటింగ్ డైరెక్టర్ రవి దేశాయ్ చెప్పారు.

లోకేష్‌ను కలిసిన టీడీపీ భీమిలి ఇన్‌చార్జ్ రాజబాబు

విశాలాంధ్ర - ఆనందపురం: ప్రజా సమస్యలు పరిష్కారం దశగా, వైసీపీ చేస్తున్న అక్రమాలను వెలికి తీసే విధంగా యవగళం పాదయాత్రలో భాగంగా మంగళగిరి నియోజకవర్గంలో పాదయాత్ర చేపడుతున్న తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి యువ నాయకులు నారా లోకేష్‌ను భీమిలి నియోజకవర్గం ఇన్చార్జ్ కోరాడ రాజబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. యువగలం పాదయాత్ర ద్వారా ప్రజల సమస్యలు దగ్గరగా తెలుసుకుంటున్నారని ప్రజలు సమస్యలు పరిష్కారం దిశగా తెలుగుదేశం పార్టీ జనంతో బలంగా ఉంటుందని ప్రజలు నమ్ముతున్నారని తెలిపారు. అలాగే భీమిలి నియోజకవర్గం పరిధిలో చేపడుతున్న పలు కార్యక్రమాలను లోకేష్‌కు వివరించారు.

100 మందికి వైద్య సేవలు

విశాలాంధ్ర - దేవీపట్నం: రామ కృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్య శాల రాజమహేంద్రవరం వారిచే శుక్రవారం అల్లూరి సీతారామరాజు జిల్లా దేవిపట్నం మండలం పోతవరం గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరంలో సుమారు 100 వైద్య సేవలు అందించినట్లు రామ కృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయానంద మహరాజ్ తెలిపారు. ఈ వైద్య శిబిరంలో రోగులకు డాక్టర్ రాయుడు శ్రీనివాస్ వైద్య సేవలు అందించి అవసరమైన 38 మందికి రక్త పరీక్షలు చేసినట్లు స్వామీజీ తెలిపారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ రాయుడు శ్రీనివాస్, రామ కృష్ణ మిషన్ కో-ఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాఠశాల భవనం పున:నిర్మించాలి

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: జీవీఎంసీ 85 వార్డులో ఉన్న అగనంపూడి బీసీ కాలనీ మండల ప్రాథమిక పాఠశాల పరిధిలో మూడు భవనాలు ఉన్నాయని, అందులో రెండు ప్రభుత్వ భవనాలు గతంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిందని, ఒకటి స్టీల్ ప్లాంట్ సిఎస్ఆర్ భవనం ఉందని, ప్రస్తుతం ప్రభుత్వ భవనాలు శిథిలావస్థలో ఉన్నాయని వెంటనే పున: నిర్మించాలని పలువురు కోరుతున్నారు. స్టీల్ ప్లాంట్ సి ఎస్ ఆర్ భవనంలో ప్రస్తుతం పాఠశాల నడుపుతున్నారని ఒకటి నుండి 5వ తరగతి విద్యార్థులు ఒకే గది ఉండటం వలన చాలా ఇరుకుగా ఉందన్నారు. అంగనవాడికి భవనము లేక స్థానికంగా ఉన్న సామాజిక భవనంలో నడుపుచున్నారని, ఆ స్టేజి వరండాలో ఎత్తుగా ఉండటం వల్ల పిల్లలు జారి పడిపోతారోనని పిల్లల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. వెంటనే పాఠశాలను పున:నిర్మించాలని పలువురు కోరుతున్నారు.



ఇద్దరు వైద్యాధికారులకు షోకాజ్ నోటీసులు

విశాలాంధ్ర - అనంతగిరి: మండలంలో గల లొంగపర్తి ప్రాథమిక వైద్యారోగ్య కేంద్రం వైద్య అధికారినీలు ఇద్దరికి షోకాజ్ నోటీసులను జిల్లా వైద్యాధికారి జారీ చేశారు. ఈ ఆసుపత్రిని గురువారం జడ్పిటిసి సభ్యుడు గంగరాజు సందర్శించగా ఇద్దరు వైద్యాధికారులు అందుబాటులో లేరు. ఓ వైద్యాధికారిని సంతకం పెట్టి ఉండటం విధుల్లో లేకపోవడం గమనించిన గంగరాజు ఈ విషయమై జిల్లా పరిషత్ సమావేశంలో చర్చిస్తానని చెప్పారు. అలాగే దీనికి సంబంధించి పలు దినపత్రికల్లో విశాలాంధ్రతో పాటు వార్తలు ప్రచురితం కావడంతో ఆసుపత్రిలో పనిచేస్తున్న ఇద్దరు వైద్య అధికారినిలకు షోకాజ్ నోటీసులు జారీ చేయమని కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు డిఎం అండ్ హెచ్ ఓ నోటీసులు జారీ చేశారు.

గ్రూప్ -1 ఉద్యోగాలు సాధించిన విజేతలకు సన్మానం

విశాలాంధ్ర బ్యూరో -పాడేరు: గ్రూప్ వన్ ఫలితాల్లో ప్రతిభ చూపిన అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అభ్యర్థులకు శుక్రవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ నిర్వహించిన ఇంటర్వ్యూలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన గిరి పుత్రికలలో ఇద్దరు గ్రూప్ 1 ఉద్యోగాలు సాధించారు. ఐటిడిఏ 21 వ సాఫ్టవేర్ సొల్యూషన్స్ సంయుక్తంగా అందించిన సివిల్స్ కోచింగ్ను సద్వినియోగం చేసుకుని ఉత్తమ ర్యాంకులు సాధించిన చిట్టపులి జీవన, జొడు వెంకట సత్యకీర్తి గురువారం ఎపిపిఎస్సి విడుదల చేసిన ఫలితాల్లో గ్రూప్-1 ఉద్యోగాలు సాధించి విజేతలుగా నిలిచారు. చిట్టపులి జీవన, వెంకట సత్తకీర్తిలను శుక్రవారం ఐటిడి ఏ కార్యాలయంలో జిల్లా కల్టెర్ సుమిత్ కుమార్, జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాసు, ఐటిడి ఏపిఓ వి. భిషేక్ ఘనంగా సన్మానించారు. 21వ సెంచరీ సాఫ్ట్వేర్ సొల్యూషన్స్ అధినేత ధరణి కి అభినందనలు తెలియ జేసారు.

పీహెచ్‌సీలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు

విశాలాంధ్ర - ఆనందపురం: విశాఖపట్నం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు శుక్రవారం ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ ఎం.గంగు నాయుడు ఆధ్వర్యంలో ఐదుగురుకి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసినట్టు సింహాచలం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షేక్ షబీనా భాను తెలిపారు. ఉమెన్ వెల్ఫేర్ ఆఫీసర్ డాక్టర్ బి.ఉమావతి పర్యవేక్షణలో ఆపరేషన్లు జరిగాయి. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ గంగ నాయుడు మాట్లాడుతూ కుటుంబ నియంత్రణ కొరకు ప్రభుత్వం ప్రత్యేకమైన కార్యక్రమాలు చేపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక అధికారి పి.సాంబమూర్తి, విహెచ్ఎన్ టి.కృష్ణవేణి, ఆరోగ్య పర్యవేక్షకులు డి.పార్వతమ్మ పాల్గొన్నారు.

మారేడుమిల్లిలో గడప-గడపకూ....

విశాలాంధ్ర - మారేడుమిల్లి: మారేడుమిల్లి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్సీ అనంత బాబు, ఎమ్మెల్యే అన్న ధనలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అనంత బాబు మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి జరగాలంటే మళ్ళీ జగనే సీఎం అవ్వాలని అన్నారు. కరోనా కష్టకాల సమయంలో ఆర్థిక ఇబ్బందులను అధిగమించి సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సీఎం జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ, జడ్పిటిసి, సర్పంచులు, వార్డ్ మెంబర్లు, వైఎస్ఆర్ పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వాంతులతో విద్యార్థి మృతి

విశాలాంధ్ర - కూనవరం: అర్ధరాత్రి రెండుసార్లు వాంతులు చేసుకొని ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థి ఎడ్ల మునీంద్ర (17) మృతి చెందిన సంఘటన స్థానిక ఉదయభాస్కర్ కాలనీలో కలకలం రేపింది. తండ్రి వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం గురువారం రాత్రి ఒంటిగంట సమయంలో మునీంద్ర నిద్రలేచి కడుపులో నొప్పి వస్తుందని తల్లిదండ్రులకు చెప్పాడు. వెంటనే వాంతి చేసుకున్నాడు. దీంతో కంగారుపడిన తల్లిదండ్రులు కూనవరంలోని ఓ ప్రైవేటు వైద్యుని వద్దకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స అనంతరం కోతలగుట్ట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గం మధ్యలో చనిపోయాడు. కాగా ఆకస్మిక వాంతుల కారణంగా ఆహారం శ్వాస నాళాలలో ఇరుక్కుపోవడం వలన ఊపిరాడక చనిపోయి ఉండవచ్చని వైద్యులు భావిస్తున్నారు. వారం క్రితమే ఇదే కాలనీలో చిలక శ్రీను అనే వ్యక్తి డెంగ్యూ లక్షణాలతో మృతి చెందడం వారం రోజుల వ్యవధిలోనే మునీంద్ర చనిపోవడంతో కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. అడిషనల్ డి ఎం హెచ్ ఓ డాక్టర్ పుల్లయ్య సూచన మేరకు కాలనీలో హెల్త్ కండక్ట్ చేశారు. ఇంటింటి సర్వే చేపట్టారు. ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తినా ఆర్ఎంపీల వద్దకు వెళ్లవద్దని, కోతలగుట్టలోని ప్రభుత్వ ఆసుపత్రికి రావాల్సిందిగా డాక్టర్ సునీల్, డాక్టర్ రాజీవ్‌లు సూచించారు.

ఇంటి సామాగ్రిని వెనక్కి పంపేసిన గ్రామస్తులు

విశాలాంధ్ర - ఎటపాక : మోడల్ ఇంటి నిర్మాణానికి ఉపయోగించే మెటీరియల్ తో వచ్చిన లారీని బాసవాగు గ్రామస్తులు వెనక పంపిన వైనమైది. వివరాలు ప్రకారం ఉపయోగించే ప్లాస్టిక్ తదితర మెటీరియల్ ఒక మినీ లారీ ఎటపాక మండలం పరిధిలోని లారీ మెటీరియల్ ఏమిటని గ్రామస్తులు ప్రశ్నించారు.దీనితో పోలవరం నిర్వాసితులకు పునరావాసానికి చెందిన మోడల్ ఇంటి నిర్మాణానికి డెమో మెటీరియల్ తీసుకువచ్చామని వాహనం వెంట వచ్చిన వ్యక్తులు పేర్కొన్నారు. దీంతో గ్రామస్తులు మా గ్రామంలో ఇటువంటి నిర్మాణం చేపట్టొద్దని గ్రామస్తులు తెలిపారు. మెటీరియల్ వాహనం వెనక్కి తిరిగి వెళ్ళిపోయినట్లు వారు పేర్కొన్నారు. ఇలా ఉంటే రాంగోపాల్ పురం బాసువాగు, లింగాలపల్లి, లక్ష్మీపురం గ్రామాలలో నివాసం ఉంటున్న సుమారు 200 కుటుంబాలు ఎస్సీ సామాజిక వర్గం చెందిన వారు. వీరా గ్రామంలో 75 సంవత్సరాలుగా 400 ఎకరాలు భూమి సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మీ భూములకు పట్టాలు లేవు ఆధార్ లేవు కావున మీకు ఎకరానికి ఐదు లక్షలు గ్రామంలోకి అధికారులు వచ్చి చెప్పి ఉన్నారు. మాకు అయిదు లక్షలు ప్యాకేజీ ఏమీ వద్దు అని అధికారులకు చెప్పారు.

వరద బాధితులకు టార్పాలిన్లు పంపిణీ

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: మండలంలోని వడ్డే గూడెం గ్రామపంచాయతీ పరిధిలోని వడ్డిగూడెం గ్రామం లో శబరి గోదావరి వరదల సమయంలో నీట మునిగిన వరద బాధిత కుటుంబాలకు ఎంఎల్ఏ ధనలక్ష్మి ఎమ్మెల్సీ అనంత బాబు కృషితో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక తహసిల్దార్ పర్యవేక్షణలో శుక్రవారం వరద బాధితులకు కుటుంబాల వారిగా సంబంధిత వాలంటీర్లచే టార్పాలీన్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రెటరీ స్వరూప రెడ్డి, సర్పంచ్ సోడి నరసమ్మ, ఉప సర్పంచ్ కోట్ల శ్రీనివాస్, బొడ్డు సత్యనారాయణ, సుమన్, ముత్యాల గౌతం, సుధీర్ పాల్గొన్నారు.

విలేకరిపై కత్తితో దాడి

- ఎస్ఈబి ఎస్సై అనుచరుడి ఘాతుకం

గాయపడిన తమ్మారావు



గాయపరచిన అనిల్‌కుమార్

విశాలాంధ్ర - పాయకరావుపేట: మండలంలోని నామవరం సమీపంలోని పెట్రోల్ బంక్ పక్కన ఉన్న దశరథ్ థాబాలో విలేఖరిపై కత్తితో దాడి చేసి గాయపరిచిన సంఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఈబి ఎస్సై అనుచరుడిగా చెప్పుకుంటున్న వ్యక్తి విలేఖరిని కత్తితో పొడిచి గాయ పరిచాడు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పీఎల్‌పురం గ్రామానికి చెందిన నెంబర్ 1 న్యూస్ ఛానల్ రిపోర్టర్ అడపా తమ్మారావు (బాబ్జి) శుక్రవారం రాత్రి దశరథ్ థాబా వద్దకు టిఫిన్ చేసేందుకు వెళ్లాడు. అక్కడ ఎస్ఈబి ఎస్సై అనుచరుడునని, కానిస్టేబుల్ అని చెప్పుకుంటున్న అనిల్‌కుమార్ అనే వ్యక్తితో గొడవ జరిగింది. తమ్మారావు ఏ డిపార్టుమెంటు అని అడగా నీకు చెప్పేది ఏంటని కత్తితో పొడిచి గాయపరిచాడు. గాయపడిన తమ్మారావును తునిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స నిర్వహిస్తున్నారు. తమ్మారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనిల్‌కుమార్, శ్రీనులపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం యలమంచిలి తరలించినట్లు ఎస్సై రమేష్ తెలిపారు.

ఎస్ఈబి ఎస్సై అండదండలతోనే అనిల్‌కుమార్ ఘాతుకాలు?

ఎస్ఈబి ఎస్సై ఎం.రామేశ్వరరావు అండదండలతోనే అనిల్‌కుమార్ ఇటువంటి ఘాతుకాలకు పాల్పడుతున్నారని పలు విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో కూడా కత్తి పట్టుకొని తాను నివాసం ఉంటున్న ఇంటి సమీపంలో కూడా హల్‌చల్ చేసిన దాఖలాలు ఉన్నాయి. ఎక్సైజ్ కానిస్టేబుల్‌నని ఎస్సై తన వాడని తాను ఎంత చెప్తే అంత అని చెప్తున్నాడని పలువురు విమర్శిస్తున్నాయి. గ్రామాల్లో సారా కాసే వారితో ఎస్సైకి మధ్య వర్తిలా ఉండి నెలవారీ మామూళ్లు తీసుకొని సారా తయారీకి సహకరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అందుచేతనే గ్రామాల్లో సారా ఏరులై పారుతుందని ఆరోపిస్తున్నారు. సారా తయారీ దారులతో కలిసి ఇతరత్రా కార్యక్రమాలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈవిషయమై ఎస్ఈబి ఎస్సై రామేశ్వరరావును వివరణ కోరగా అనిల్‌కుమార్ కేవలం ఇన్‌ఫార్మర్ మాత్రమేనని తెలిపారు. అనిల్‌కుమార్‌కు, తనకు ఎటువంటి సంబంధం లేదని, తనపై ఉన్న ఆరోపణలు అవాస్తవాలన్నారు. అయితే విలేఖర్లు అడిగిన ప్రశ్నలకు తడబడిన ఎస్సై తనకు చెందిన సమాచారం ఏమైనా బయట పడుతుందని హుటాహుటిన పాయకరావుపేట పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అందజేత

సీపీ త్రివిక్రమ్ వర్మ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖ పట్నం సిటీ పరిధిలో మొబైల్స్ పోగొట్టుకున్న వారి కోసం వాట్సప్ యాప్ ఫిర్యాదుల కోసం చాట్ - బోట్ వెబ్ పోర్టల్ ద్వారా "మొబైల్ రికవరీ" చేసి తిరిగి బాధితులకు అప్పగించడం జరుగుతుందని సిపి తెలిపారు. విశాఖ పట్నంలోని సిటీ పోలీస్ కమిషనరేట్‌లో "మొబైల్ రికవరీ" కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఫిర్యాదులు తమ పోయిన మొబైల్‌లు తిరిగి పొందడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.కోల్పోయిన మొబైల్‌లను ఉపయోగిస్తున్న ప్రస్తుత వినియోగదారులను పట్టుకోవడానికి నిరంతర ప్రయత్నాలపై వారితో మాట్లాడి, తక్కువ వ్యవధిలో ఇప్పటివరకు 200 మొబైల్‌లను తిరిగి అప్పగించినట్లు సిపి తెలిపారు. సిటీ పోలీస్‌కి చెందిన సీసీ ఎస్ బృందం టెక్ సెల్ డేటా సహాయంతో అన్ని సాంకేతిక కోణాల్లో విశ్లేషించిందని అన్నారు. సీసీఎస్ పోలీసులు దొంగతనం చేసిన మొబైల్ వినియోగదారులతో మాట్లాడి వారి నుంచి మొబైల్స్ స్వాధీనం చేసుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి సుమారు రూ.50 లక్షల విలువైన 200 మొబైల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనర్ తెలిపారు. రికవరీ చేసిన మొబైల్స్‌ను విశాఖపట్నం సిటీ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ నేరుగా ఫిర్యాదులకు అందజేశారు.

ఫోర్టిఫైడ్ బియ్యం వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఫోర్టిఫైడ్ బియ్యం పై ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేసి, వినియోగంపై అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ కె ఎస్ విశ్వనాథన్ అన్నారు. శుక్రవారం సాయంత్రం మద్రిపాలెం లో గల ఎఫ్ సిఐ గోడౌన్స్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ఫోర్టిఫైడ్ బియ్యంతో తయారుచేయు వంటకాల పోటీల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫోర్టిఫైడ్ బియ్యం పౌష్టిక విలువలతో కూడుకున్నదని, మనం రోజు తినే ఆహార పదార్థాలలో పోషక లోపాలను సమతుల్యం చేసేందుకు కృత్రిమంగా కొన్ని పోషకాలు కలిపి ప్రతి 100 కేజీల బియ్యం కు ఒక కేజీ కృత్రిమ బియ్యం గా తయారు చేయుటను ఫోర్టిఫికేషన్ అంటారని తెలిపారు. మానవ శరీరంలో హిమోగ్లోబిన్ ఉత్పత్తి కొరకు మరియు అవసరమైన ఐరన్, పెంపొందేందుకు ఫోర్టిఫైడ్ బియ్యం దోహదపడుతుందని అన్నారు. గర్భిణీలకు, చిన్నపిల్లల ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ సందర్భంగా ఫోర్టిఫైడ్ బియ్యంతో తయారుచేసిన వంటకాలలో టిఆర్ఎం కాలనీ కి చెందిన అంగన్వాడి సూపర్వైజర్ కే కృష్ణవేణి కి మొదటి బహుమతి, రెండో బహుమతిగా మౌలా బిబి, నూకరత్నం, ఆదిలక్ష్మిల కు అందజేయడం జరిగింది. అదేవిధంగా డ్వాక్రా గ్రూపుకు చెందిన బి వరలక్ష్మికి మూడో బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో నెడ్ క్యాప్ చైర్మన్ కె కె రాజు , డి ఎల్ డి ఓ పూర్ణిమదేవి, డి ఎం సివిల్ సప్లై ఐ.రాజేశ్వరి, ఐసిడిఎస్ పిడి వెంకటేశ్వరి, ఎ డి డిజేబుల్ వెల్ఫేర్ మాధవి, డి ఆర్ డి ఎ పి డి శోభారాణి, డీఎస్ఓ సూర్యప్రకాశరావు, 24వ వార్డ్ కార్పొరేటర్ పద్మారెడ్డి , అంగన్వాడి సూపర్వైజర్లు, డ్వాక్రా సంఘం సభ్యులు, చౌక ధరల దుకాణాల డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ఓటరు సర్వే శతశాతం పూర్తి చేయాలి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఇంటింటి ఓటరు సర్వే శతశాతం పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా అన్నారు. శుక్రవారం సాయంత్రం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి, జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి మాట్లాడుతూ రాష్ట్రంలో ఇంటింటి సర్వే త్వరిత గతిన పూర్తి చేయాలని, అదే సమయంలో అర్హత గల ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా కలెక్టర్ డా.ఏ. మల్లిఖార్జున మాట్లాడుతూ విశాఖ జిల్లాలో ఇప్పటి వరకు 7,01,879 ఇళ్లకు గాను, 82.46 శాతం సర్వే పూర్తి చేయడం జరిగిందన్నారు. అదే విధంగా 13,22,973 ఓటర్ల సర్వే చేయడం జరిగిందన్నారు. రానున్న మూడు రోజుల్లో శతశాతం పూర్తి చేయడం జరుగు తుందని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస మూర్తి, రెవెన్యూ డివిజనల్ అధికారులు హుస్సేన్ సాహెబ్, భాస్కర్ రెడ్డి, వి ఎమ్ ఆర్ డి ఎ ఎస్టేట్ అధికారి లక్ష్మారెడ్డి, డిప్యూటీ కలెక్టర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పాడేరులో కదం తొక్కిన పీవీటీజీ గిరిజనులు

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా వ్యాప్తంగా ఆదిమ గిరిజనసంఘం ఆధ్వర్యంలో ఆదిమ పీవీటీజీ గిరిజనులు పాడేరు లో భారీ ర్యాలీ, ధర్నాలతో కదం తొక్కారు. శుక్రవారం పెద్ద ఎత్తున గిరిజన చేరుకొని ఐటిడిఏ వద్ద నిరసన తెలిపారు. పీవీటీజీ లకు ఇవ్వాల్సిన 35 కేజీల అంత్యోదయా కార్డులు,5 లక్షల తో ఇల్లు,గ్రామాలకు తారురోడ్లు, సీసీ రోడ్లు, సీసీడీపీ నిధులు మంజూరు చేయాలని నినదించారు. ఈ కార్యక్రమానికి ఉద్దేశించి సీపీఎం పార్టీ అనంత గిరి జడ్పీటీసీ దీసారి గంగరాజు మాట్లాడుతూ...కేంద్రంలో ని బీజేపీ మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలో ని వైసీపీ జగన్ ప్రభుత్వం పీవీటీజీ లకు కేటాయించిన నిధులు ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నాయని అన్నారు. పీవీటీజీ ..పాడేరు ఐటీడీఏ పరిధిలో 1664 గ్రామాల్లో 1 లక్ష 75 వేల మంది పీవీటీజీ లు జీవిస్తున్నారని, స్వాతంత్ర్యం వచ్చి76 ఏళ్లు గడుస్తున్నా ఆదిమ పీవీటీజీ లు నేటికి, వారున్న గ్రామాల్లో రోడ్లు,లేక డోలి మోత లే దిక్కుగా ఉన్నాయని,ఎందరో వైద్యం అందక చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస మౌలిక వసతులైన తారు రోడ్లు,మంచి నీరు వంటివి పీవీటీజీ గ్రామాలు నేటికి నోచుకోలేదని అన్నారు. కార్యక్రమంలో హుకుంపేట మండలం వైస్ ఎంపీపీ కొండలరావు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పొద్దు బాలదేవ్, అధ్యక్షుడు పాలికి లక్కు, జీకే వీధి ఎంపీటీసీ అంపురంగి బుజ్జిబాబు, లక్ష్మీ పురం సర్పంచ్ కొర్ర త్రినాథ్, ఆదివాసీ గిరిజన ఎల్ సుందర్ రావు, కిల్లో సత్యనారాయణ, పెద్ద సంఖ్యలో 12 మండలాలు నుండి ఆదిమ పీవీటీజీ గిరిజనులు పాల్గొన్నారు.

ఓటరు సర్వే వేగవంతం చేయాలి

నర్సీపట్నం ఆర్డీవో జయరాం

విశాలాంధ్ర - మాకవరపాలెం: ఓటరు సర్వే వేగవంతం చేయాలని నర్సీపట్నం ఆర్డీవో హెచ్‌వి.జయరాం అన్నారు. శుక్రవారం మాకవరపాలెం తహశీల్దార్ కార్యాలయంలో ఓటరు సర్వేపై మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో ఆర్డీవో ఇప్పటి వరకు ఆయా గ్రామాల్లో ఎంత మేర సర్వే జరిగింది, బిఎల్‌ఒల పనితీరుపై ఆరా తీశారు. సర్వే వేగవంతానికి కృషి చేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు సర్వే కార్యక్రమాన్ని పరీక్షించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ప్రసాదరావు, ఎంపిడిఒ అరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ ఉద్యోగుల గ్రీవెన్స్‌కి 10 ఫిర్యాదులు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ ఉద్యోగుల గ్రీవెన్స్‌కు 10 ఫిర్యాదులు అందాయని జివిఎంసి అదనపు కమిషనర్ డాక్టర్ వై శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జివిఎంసి కమిషనర్ సీ ఎం సాయికాంత్ వర్మ ఆదేశాల మేరకు జివిఎంసి ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో జివిఎంసి ఉద్యోగుల గ్రీవెన్స్ అదనపు కమిషనర్లు ఎస్ ఎస్ వర్మ, డాక్టర్ వి సన్యాసి రావుతో కలసి నిర్వహించారు. గ్రీవెన్స్ కు 10 ఫిర్యాదులు అందాయని వాటిని పరిశీలించి కమిషనర్ నిర్ణయం మేరకు పరిష్కరించేందుకు తగు నిర్ణయం తీసుకోవడంతో పాటు ప్రభుత్వానికి నివేదించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఇంజినీరు రవికృష్ణ రాజు, డిసి(రెవెన్యూ) ఫణిరాం, డిడి(హార్టికల్చర్) దామోదర రావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

వార్డు ఉప ఎన్నికలో తెదేపా ఎన్నికల బహిష్కరణ

విశాలాంధ్ర - కొయ్యూరు : రేవళ్ల పంచాయతీ ఐదవ వార్డులో జరగనున్న ఉప ఎన్నికను తాము బహిష్కరించినట్లు స్థానిక సర్పంచ్ జనుమూరి వెంకటలక్ష్మి, తెదేపా నేత మేడిబోయిన చిన్న తెలిపారు. మండలంలోని రేవళ్ల పంచాయతీ ఐదవ వార్డు ఉప ఎన్నికకు చర్యలు చేపట్టిన ఎన్నికల అధికారులు వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని తెదేపా నేతలు పేర్కొన్నారు. ఓటరు లిస్టును వైసీపీకి అనుకూలంగా తయారు చేసి ఇతర పార్టీలకు కనీసం సమాచారం కూడా ఇవ్వడం లేదని తెలిపారు. నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన ఎన్నికల అధికారులు వైసిపి ఏజెంట్లు లా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ, అందుకే తాము ఈ ఎన్నికను బహిష్కరిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెదేపా నేతలు బేతాళ అప్పారావు స్వామి రమణ సన్యాసిరావు బూరుగులయ్య అప్పలరాజు లక్ష్మణరావు దుర్గ భవాని అనిల్ కుమార్ తదితర పలువురు పాల్గొన్నారు.

ఫ్లూ వ్యాక్సిన్ తప్పనిసరి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: వర్షాకాలం, చలికాలంలో ఉష్ణోగ్రత హెచ్చుతగ్గుల కారణంగా వేగంగా నాలుగు వైరస్‌లు వ్యాప్తి చెందుతాయని, పిల్లలు ఈ వైరస్‌లలో వేటి నుండి అయినా ఫ్లూ బారిన పడవచ్చునని మెడికవర్ హాస్పిటల్‌కు చెందిన వైద్యులు డాక్టర్ ఎంఎస్ సునీల్ కిషోర్ చెప్పారు. చిన్న పిల్లలు, వృద్ధులు కి ఫోర్ ఇన్ ఒన్ ఫ్లూ వాక్సిన్ వేయించాలన్నారు. సాధారణంగా ఫ్లూ అని పిలువబడే ఇన్‌ఫ్లుయెంజాకు నాలుగు రకాల వైరస్‌లు కారణమయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. ఫ్లూ వైరస్ ముక్కు గొంతు కొన్నిసార్లు ఊపిరితిత్తులకు సోకుతుందన్నారు. 5 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలు వృద్ధులు ఆసుపత్రిలో చేరాల్సిన అవసరం కలిగించటంతో పాటుగా మరణానికి కూడా ఇది ప్రధాన కారణంగా నిలిచే అవకాశాలు వున్నాయన్నారు. ఏడాదికి రెండుసార్లు అంటే వర్షాకాలంలో ఒకసారి, చలికాలంలో ఒకసారి అత్యధికంగా ఫ్లూ కేసులు చూస్తుంటామని, ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు సంవత్సరానికి ఒకసారి ఫ్లూ టీకాలు వేయించటం ద్వారా నిరంతర రక్షణను నిర్ధారించవచ్చునన్నారు.

కనకమహాలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు



విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం; శ్రీ కనక మహా లక్ష్మీ అమ్మవారి దేవస్థానంలో శ్రావణ మాసం సందర్భంగా జరుగు "శ్రావణలక్ష్మీ ప్రత్యేక పూజలు మొదటి శ్రావణ శుక్రవారం శ్రీ అమ్మవారికి విశేషపూజ నిర్వహించారు. వేదమంత్రముల మధ్య నాదస్వర సుస్వరాల మధ్య పూజలు నిర్వహించారు. ఈ పూజలో 176 మంది భక్తులకు పూజలు చేయించినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. శ్రావణ మాసం నెలరోజులు జరిగే ఈ శ్రావణలక్ష్మీ పూజకు అవసరమగు పూజా సామగ్రి అంతయు దేవస్థానం వారే సమకూర్చేదరని, ఈ ప్రత్యేక పూజా రుసుము రూ. 400/-లు పూజ అనంతరం ఉభయదాతలకు శేషవస్త్రంగా కండువా, జాకెట్టు ముక్క రాగి స్టాండు యంత్రం ప్రసాదం ఇవ్వబడునని, భక్తులు పవిత్ర శ్రావణమాసంలో అమ్మవారిని పూజించి, దర్శించ తరించవలసినదిగా దేవస్థానం చైర్మన్ కొల్లి సింహాచలం కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారిణి శ్రీమతి కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీమతి కె. సింహాచలం, ధర్మకర్తలు శ్రీమతి బొదిలపాటి సత్య రూపవాణి, శ్రీమతి బి. వెంకటరత్నం, శ్రీమతి బి. అనురాధ, ఎస్. సతీష్, ఎన్.ఎస్.ఎస్. సుబ్రహ్మణ్యం, వి. మారుతి ప్రసాద్ ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె. తిరుమలేశ్వర రావు, వేదపండితులు, అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.

విశాలాంధ్ర
→ విశాఖపట్నం
→ అనకాపల్లి
→ అల్లూరి సీతారామరాజు

డెంగ్యూ జ్వరంతో జరభద్రం అంటున్న ఓఎస్‌జీ ఫౌండేషన్ శివదళాయి

విశాలాంధ్ర - పద్మనాభం : వర్షా కాలం మొదలవుతుంది అంటే డెంగ్యూ సీజన్ వచ్చింది అనీ అర్థం దీని వాళ్ళ శరీరంలో తెల్ల రక్త కణాలు సంఖ్య తగ్గిపోయి బ్లడ్ బ్యాంకుల చుట్టూ హాస్పిటల్ చుట్టూ తిరుగుతూ ప్రాణాలు కోల్పోతే చాలామంది చూస్తున్నాం ఇది దేనివల్ల వస్తుంది డెంగ్యూ అంటే ఏంటి అనే విధంగా వివరించే ఈ యొక్క కథనాన్ని శ్రద్ధగా చదువుతారని విన్నవిస్తూ మీ ఓఎస్‌జి ఫౌండేషన్ శివ దళాయి. డెంగ్యూ జ్వరం డెంగ్యూ వైరస్ వల్ల వచ్చే దోమల వల్ల కలిగే వ్యాధి. లక్షణాలు సాధారణంగా సంక్రమణ తర్వాత మూడు నుండి పద్నాలుగు రోజుల తరువాత ప్రారంభమవుతాయి. ఇందులో అధిక జ్వరం, తలనొప్పి, వాంతులు, కండరాలు, కీళ్ల నొప్పులు, చర్మపు దద్దుర్లు ఉంటాయి. ఆరోగ్యం మెరుగుపడటానికి సాధారణంగా రెండు నుండి ఏడు రోజులు పడుతుంది. తక్కువ సంఖ్య కేసులలో, ఈ వ్యాధి తీవ్రమైన డెంగ్యూగా అభివృద్ధి చెందు తుంది, దీనిని డెంగ్యూ హెమరేజిక్ జ్వరం అని కూడా పిలుస్తారు, దీని ఫలితంగా రక్తస్రావం, తక్కువ స్థాయి బ్లడ్ ప్లేట్‌లెట్స్, బ్లడ్ ప్లాస్మా లీకేజ్ లేదా డెంగ్యూ షాక్ సిండ్రోమ్‌గా మారుతుంది. డెంగ్యూ ఈడెస్ రకానికి చెందిన అనేక జాతుల ఆడ దోమల ద్వారా వ్యాపిస్తుంది, ప్రధానంగా ఎ. ఈజిప్టి. వైరస్ ఐదు రకాలను కలిగి ఉందిటీ ఒక రకంతో సంక్రమణ సాధారణంగా ఆ రకానికి జీవితకాల రోగ నిరోధక శక్తిని ఇస్తుంది, అయితే ఇతరులకు స్వల్పకాలిక రోగనిరోధక శక్తి మాత్రమే ఇస్తుంది. వేరే రకంతో సంక్రమణ, తీవ్రమైన సమస్యల ప్రమాదాన్ని పెంచుతుంది. వైరస్ లేదా దానికు ప్రతిరోధకాలను గుర్తించడంతో సహా రోగ నిర్ధారణను నిర్ధారించడానికి అనేక పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. డెంగ్యూ జ్వరం కోసం టీకా ఆమోదించ బడింది. ఈ టీకా వాణిజ్యపరంగా అనేక దేశాలలో అందు బాటులో ఉంది. అయితే, టీకా గతంలో సోకిన వారిలో మాత్రమే సిఫార్సు చేయబడింది. నివారణ యొక్క ఇతర పద్ధతులు దోమల నివాసాలను తగ్గించడం, కాటుకు గురికావడాన్ని పరి మితం చేయడం. వదిలించుకోవటం లేదా నిలబడి ఉన్న నీటిని కప్పడం, శరీరంలో ఎక్కువ భాగం కప్పే దుస్తులు ధరించడం ద్వారా ఇది చేయవచ్చు. తీవ్రమైన డెంగ్యూ చికిత్స సహాయకారిగా ఉంటుంది, తేలికపాటి లేదా మితమైన వ్యాధికి నోటి ద్వారా లేదా ఇంట్రావీనస్‌గా ద్రవాన్ని ఇవ్వడం ఉంటుంది.మరింత తీవ్రమైన కేసులకు, రక్త మార్పిడి అవసరం కావచ్చు. ప్రతి సంవత్సరం అర మిలియన్ మందికి ఆసుపత్రి ప్రవేశం అవసరం. వాడకం నుండి రక్తస్రావం పెరిగే ప్రమాదం ఉన్నందున జ్వరం తగ్గింపు, డెంగ్యూలో నొప్పి నివారణ కోసం నాన్‌స్టెరాయిడ్ యాంటీ ఇన్ఫ్లమేటరీ డ్రగ్స్ (ఎన్ఎస్ఎఐడి)కు బదులుగా పారా సెటమాల్ (అసిటమినోఫెన్) సిఫార్సు చేయబడింది. రెండవ ప్రపంచ యుద్ధం నుండి డెంగ్యూ ప్రపంచ సమస్యగా మారింది, 110కి పైగా దేశాలలో, ప్రధానంగా ఆసియా, దక్షిణ అమెరికాలో సాధారణం. ప్రతి సంవత్సరం 50, 528 మధ్య మిలియన్ల మంది వ్యాధి బారిన పడ్డారు, సుమారు 10,000 నుండి 20,000 మంది మరణిస్తున్నారు. 1 వ్యాప్తి చెందిన తేదీ యొక్క ప్రారంభ వివరణలు. దీని వైరల్ కారణం, 20 వ శతాబ్దం ప్రారంభంలో అర్థం చేసుకోబడింది. దోమలను తొలగించడమే కాకుండా, వైరస్‌ను నేరుగా లక్ష్యంగా చేసుకునే మందుల కోసం పని కొనసాగుతోంది. ఇది నిర్లక్ష్యం చేయబడిన ఉష్ణమండల వ్యాధిగా వర్గీకరించబడింది.

శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి రోడ్డుకు శంఖుస్థాపన

విశాలాంధ్ర - పెందుర్తి : జీవి ఎంసీ 93వ వార్డు, నాయుడుతోట వద్ద గల శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి బిటి రోడ్డు నిర్మాణానికి, పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ శంకుస్థాపన చేశారు. సాయిమాధవ నగర్‌లోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి నుండి సాయిబాబా దేవాలయం వరకు 20 లక్షలతో నిర్మించనున్న తారు రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పోరేటర్ రాపర్తి కన్నా, శంకర్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ కృష్ణ కుమార్ ఆత్మకూరి, జనరల్ మేనేజర్ కె.రాధాకృష్ణన్, డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజానికి శంకర్ ఫౌండేషన్ అందిస్తున్న సేవలను కొనియాడుతూ, కంటి సంరక్షణ నిర్వహణలో శ్రేష్ఠత దిశగా సాగుతున్న ఆసుపత్రికి అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

సీలేరు డీఏవీ పాఠశాలలో వెల్లివిరిసిన విద్యాకుసుమం

విశాలాంధ్ర - సీలేరు : జికేవీధి మండలం సీలేరులోని ఏపి జెన్‌కో ఆధ్వర్యంలో నడపబడుతున్న డిఎవి పాఠశాల నందు మరొక క్రీడా కుసుమం వెల్లివిరిసింది. ఇటీవల అరకు ఏపిటిడబ్ల్యూఆర్ క్రీడా పాఠశాల నందు ప్రవేశానికి నిర్వహించిన శారీరక పరీక్షల్లో రాష్ట్రం నుండి 300 మంది విద్యార్థులు హాజరు కాగా, డిఎవి పాఠశాల నుండి కె.దుర్గాదారేష్, బి.మణికంఠ పాల్గన్నారు. వీరిలో దుర్గాదారేష్ రెండు రౌండ్లను పూర్తి చేసుకొని 7వ ర్యాంకు సాధించి అరకులో ఉన్న ఏపిటిడబ్ల్యూఆర్ క్రీడా పాఠశాల నందు ప్రవేశానికి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా దుర్గాదారేష్‌ను, అతనికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు కమలాకర్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.రామచందర్, జెన్‌కో ఎస్ఇ ప్రశాంత్‌కుమార్, పాఠశాల సిబ్బంది అభినందించారు.

జనసేన సమావేశానికి హాజరవ్వండి : మడివి రాజు

విశాలాంధ్ర - చింతూరు : రంపచోడవరంలో జరిగే జనసేన డివిజన్ స్థాయి సమావేశం ఈనెల 20వ తేదీ10 గంటలకు జరుగుతుందని చింతూరు మండల జనసేన అధ్యక్షులు మడివి రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశాన్ని జయప్రదం చేయాలని జనసేన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగాఅరకు పార్లమెంటరీ ఇంచార్జ్ వంపురి గంగులయ్య , తూర్పుగోదావరి జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు కందుల దుర్గేష్ ముఖ్య ఈ సమావేశం నిర్వహించబడుతుందని తెలిపారు. మండల అధ్యక్షులు కార్యదర్శులు తప్పక హాజరుకావాలని కోరారు. ఈ సమావేశంలో క్రియాశీల సభ్యత్వ కిట్లపంపిణీ జరుగుతుందని తెలిపారు. డివిజన్లోని 11 మండలాల అధ్యక్ష కార్యదర్శులతో పాటు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని పేర్కొన్నారు

పంచాయతీ అధికారుల దృష్టికి చోడవరం కోటవీది త్రాగు నీటి సమస్యలు

విశాలాంధ్ర - చోడవరం : స్థానిక కోటవీధిలో గుక్కెడు త్రాగు నీటి కోసం మహిళలు నానా ఇబ్బందులు పడుతు న్నారని, తక్షణమే అధికారులు స్పందించి కోటవీది ప్రజల దాహార్తిని తీర్చవలసిందిగా మహిళా సంఘం నాయకురాలు గూనూరు వరలక్ష్మి డిమాండ్ చేశారు. మంచినీటి సమస్యను శుక్రవారం పంచాయతీ ఈ.ఓ దృష్టికి తీసుకెళ్ళారు. మహిళల వినతుల మేరకు శుక్రవారం ఉదయం ఈ.ఓ కోటవీధిలో తాగునీటి సమస్యల పై పర్యవేక్షించి, క్షేత్ర స్థాయిలో వున్నటువంటి సమస్యలను గుర్తించారు. అనంతరం ఆయన మహిళలతో మాట్లాడుతూ మంచి నీటి సమస్యను పది రోజుల్లో పరిష్కారించగలమని హామీ ఇచ్చారు. ఈ.ఒ.తో మహిళలు మాట్లాడుతూ మంచినీళ్ల కోసం పడుతున్న సమస్యలను వివరించారు. సమస్యను తొందరగా పరిష్కరించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది ముత్యాలనాయుడు, కోటవీది మహిళలు లక్ష్మి, రమణమ్మ, నాగరత్నం, సత్యవతి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు....

కళ్ల దానంతో ఇద్దరి జీవితాల్లో వెలుగు

విశాలాంధ్ర - మాకవరపాలెం : మరణంలోను మానవత్వం పరిమళించింది. అవయవదానం మరొక కుటుంబాన్ని నిలబెట్టవచ్చుననే సామాజిక స్పృహ అందరికీ స్ఫూర్తిగా నిలుస్తోంది. వివరాల్లోకి వెళితే మాకవరపాలెం మండలం శెట్టిపాలెం గ్రామానికి చెందిన పూడి రాము గత కొన్ని రోజులుగా లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. బుధవారం పరిస్థితి విషమించడంతో విశాఖలోని అమెరికన్ హాస్పిటల్‌లో జాయిన్ చేయగా అదే రోజు రాత్రి 9:30 గంటలకి మృతి చెందాడు. వెంటనే తన కుమారుడు పూడి గంగరాజు, మావయ్య రమేష్ స్ఫూర్తిదాయకంగా ఆలోచించి రాము కళ్లను దానం చేయాలని నిర్ణయించుకుని జీవనదాన్ ప్రతినిధులను సంప్రదించగా వారు వెంటనే విశాఖ ఎల్‌వి ప్రసాద్ కంటి హాస్పిటల్ వారితో మాట్లాడి అన్ని ఏర్పాట్లను చేయించి పూడి రాము రెండు కళ్ళను సేకరించి వైజాగ్ ఎల్‌వి.ప్రసాద్ కంటి హాస్పిటల్‌కి తలించడం జరిగింది. దుఃఖంలో కూడా మరో ఇద్దరికి కంటి వెలుగు నింపిన రాము గారి కుటుంబ సభ్యులని పలువురు అభినందించడం జరిగింది.

ఎమ్మెల్సీ ఎమ్మెల్యేకు నిరసన సెగ

విశాలాంధ్ర - మారేడుమిల్లి : మారేడుమిల్లి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల పర్యటన లో భాగంగా శుక్రవారం ఎమ్మెల్సీ అనంత బాబు, ఎమ్మెల్యే ధనలక్ష్మి బొదులూరు, చెట్ల వాడ రోడ్డు, సచివాలయం ప్రారంభోత్సవానికి వెళుతుండగా కుట్రవాడ ప్రధాన రహదారిపై టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ పల్లాల రాజ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో టిడిపి కార్యకర్తలు గిరిజనలు రోడ్డుకి అడ్డంగా బైఠాయించి ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే కాన్వాయ్ అడ్డుకున్నారు. ఎమ్మెల్సీ అనంత బాబు గో బ్యాక్, అంటూ నినాదాలతో ఆదివాసి ప్రాంతంలో అక్రమాలకు పాల్పడుతున్న అనంత బాబుని తరిమికొట్టాలి, బెంతు, ఓరియాలను, బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చొద్దు అంటూ, జీవో నెంబర్ 52 రద్దు చేయాలని, దళిత యువకుడు సుబ్రహ్మణ్యం కుటుంబాన్ని ఆదుకోవాలని, పాతకోట సిసి రోడ్డు నిర్మించాలని ప్లే కార్డ్స్ తో నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోలీసులకు గిరిజన యువకుల మధ్య చిన్న తోపులాట జరగడంతో పోలీసుల వలయంతో ఎమ్మెల్సీ కాన్వాయ్ ముందుకు తీసుకెళ్లడం జరిగింది. ఈ కార్యక్రమంలో చావడి కోట సర్పంచ్ సాధన ప్రేమ్ కుమార్ రెడ్డి, కుట్రవాడ సర్పంచ్ పల్లాల భూపతి రెడ్డి, వేటికి ఉప సర్పంచ్ కత్తుల కుమార్ వరప్రసాద్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ సెక్రటరీ రేపుల జానకి రెడ్డి, చిరంజీవి రెడ్డి పాల్గొన్నారు

సెబీ వద్ద డిఆర్‌హెచ్‌పి దరఖాస్తు చేసిన ఈ ప్యాక్ డ్యూరబుల్

విశాలాంధ్ర - విశాఖ సిటీ : ఈ ప్యాక్ డ్యూరబుల్స్ లిమిటెడ్ తమ డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ ని మార్కెట్ రెగ్యులేటర్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా వద్ద దాఖలు చేసింది. రూమ్ ఎయిర్ కండీషనర్ ఒరిజినల్ డిజైన్ తయారీదారులు ఈక్విటీ షేర్ల (ఒక్కొక్కటి ముఖ విలువ రూ. 10) ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ ద్వారా నిధులను సేకరించాలని కంపెనీ యోచిస్తోంది. ఈ ఆఫర్‌లో రూ. 400 కోట్ల వరకు ఈక్విటీ షేర్‌ల తాజా ఇష్యూ మరియు 13,067,890 వరకు ఈక్విటీ షేర్ ల ను ఆఫర్ ఫర్ సేల్ కు అందుబాటులో ఉంచింది. కంపెనీ తాజా ఇష్యూ నుండి వచ్చే నికర ఆదాయాన్ని తయారీ సౌకర్యాల విస్తరణ / ఏర్పాటు కోసం మూలధన వ్యయం కోసం ఉపయోగించాలని ప్రతిపాదిస్తుంది. కంపెనీ యొక్క నిర్దిష్ట బకాయి రుణాలు, సాధారణ కార్పొరేట్ ప్రయోజనాల రీపేమెంట్ మరియు / లేదా ముందస్తు చెల్లింపు కోసం వినియోగించనున్నారని ఈ ప్యాక్ డ్యూరబుల్ ప్రతినిధి వెల్లడించారు.

జనసేనలో చేరిన అయిత సింహాచలం

విశాలాంధ్ర - పెందుర్తి : జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ సమక్షంలో జిల్లా యాదవ సంఘం ఉపాధ్యక్షులు, పులగాలిపాలెం మాజీ సర్పంచ్ అయిత సింహాచలం జనసేన పార్టీలో చేరారు. జనసేన పార్టీ నాయకుడు పంచకర్ల రమేష్ బాబు ఆశీస్సులతో ఆ పార్టీలో చేరినట్టు సింహాచలం శుక్రవారం ఉదయం తెలియజేశారు. నగరంలోని దస్పల్లా హెరాటల్లో బస చేసిన పవన్ కళ్యాణ్ వద్దకు పంచకర్ల రమేష్ బాబు, అయిత సింహాచలంను తీసుకొని వెళ్లి పవన్ కళ్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలో చేర్పించారు.ఈ సందర్భంగా సింహాచలం మాట్లాడుతూ జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు నచ్చి జనసేన పార్టీలో పంచకర్ల రమేష్ బాబు ఆశీస్సులతో చేరినట్లు తెలిపారు. రానున్న కాలంలో పెందుర్తి నియోజకవర్గంలో జనసేన పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని తెలియజేశారు.

సిబిఎ టాపర్స్‌కి అభినందన

విశాలాంధ్ర - మాకవరపాలెం : సిబిఎ పరీక్షలో తూటిపాల యూపీ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఇటీవల నిర్వ హించిన ఫార్మేటివ్ అసిస్మెంట్ వన్(క్లాస్ రూమ్ బేస్ట్ అసెస్మెంట్) సిబిఎ పరీక్షలలో అన్ని తరగతులలో అత్యధిక మార్కులు వచ్చిన టాపర్ విద్యార్థులను శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోసూరు రాము అభినందించారు. మిగిలిన విద్యార్థులను కూడా మరింత ప్రోత్సహించేందుకు దాతల సహకారంతో టాపర్స్ అందరికీ మెడల్స్ అందజేశారు.

అనారోగ్యంతో అంగన్వాడీ టీచర్ మృతి

విశాలాంధ్ర - హుకుంపేట : మండలంలో మారేల గ్రామానికి చెందిన అంగన్వాడీ టీచర్ అనారోగ్యంతో మృతి చెందారు. దీనిని సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలో మారేల అంగన్వాడీ టీచర్ గా విధులు నిర్వహిస్తున్న పొట్టంగి బుల్లమ్మ (50) అనారోగ్యం గురి కావటంతో కుటుంబ సభ్యులు విశాఖ పట్నం సెవెన్హెల్స్ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్య సేవలు అందిస్తుండగా గురువారం సాయంత్రం మృతి చెందటంతో కుటుంబ సభ్యులు శుక్రవారం స్వగ్రామమైన మారేలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ సిబ్బంది, తోటి అంగన్వాడీ టీచర్లు గ్రామానికి చెరుకొని కన్నీటి వీడ్కోలు తెలిపారు.

ఆరిలోవలో రోడ్లు విస్తరణపై పరిశీలన

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : ఆరిలోవ ప్రాంతంలో రోడ్ల విస్తరణ పనులపై, 11 వ వార్డులో రోడ్ల విస్తరణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయి కాంత్ వర్మ తెలిపారు. శుక్రవారం ఇద్దరు రెండవ జోన్ 11వ వార్డు పరిధిలోని ఆరిలోవ పార్వతి నగర్, బాలాజీ నగర్ , తోటగరువు జంక్షన్, రవీంద్ర నగర్, ఓల్డ్ డైరీ ఫారం తదితర ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా సాయిబాబా మందిరం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు, అంబేద్కర్ విగ్రహం నుండి పెదగదిలి జంక్షన్ వరకు, తోట గురువు నుండి రవీంద్ర నగర్ జంక్షన్ వరకు రోడ్డు విస్తరణ పనులు చేయుటకు ఆయా ప్రాంతాలను పరిశీలించారు. ఆరిలోవ ప్రధాన రహదారి, గ్రీన్ బెల్ట్ ఏరియాలో ఆక్రమణలు తొలగించాలని ఆరిలోవ ప్రధాన రహదారి లో గెడ్డలపై కల్వర్టులు, వంతెనలు విస్తరణ పనులు చేపట్టాలని, వివేకానంద పార్కు ఆధునికరణ కొరకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆరిలోవ ప్రాంతంలో రోడ్డుకిరువైపులా ఉన్న ఆక్రమణలు, భవన నిర్మాణ వ్యర్థాలు తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారిని సునీత ను ఆదేశించారు. పెదగదిలి లో ఫుట్ పాత్ పనులు, భూగర్భ డ్రైనేజీ పనులను సంబంధిత కాంట్రాక్టర్ తో మాట్లాడి త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చూడాలని పర్యవేక్షక ఇంజనీర్ శ్యా%శీ%సన్ రాజు ను ఆదేశించారు. ఈ పర్యటనలో ప్రధాని ఇంజనీర్ రవి కృష్ణంరాజు, చీఫ్ సిటీ ప్లానర్ వి సునీత, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, ఏఎమ్ఓ హెచ్.కిషోర్, కార్యనిర్వాహక ఇంజనీరు మత్స్య రాజు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటడం సామాజిక బాధ్యత

విశాలాంధ్ర - పెదగంట్యాడ : మొక్కలు నాటడాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా గుర్తెరగాలని 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడు అన్నారు. ఇంటి పరిసరాలతో పాటు ఆలయాలు, మసీదులు, చర్చిల ప్రాంగణాల్లో విరిగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. వార్డులోని అశోక్ నగర్ రోడ్డు నంబర్-7లో నూకాంబిక అమ్మవారి ఆలయం ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్య అతిథిగా కార్పొరేటర్ నరసింహ పాత్రుడు,అనురాధ దంపతులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలుష్య రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యాన్ని అరికట్టగల శక్తి మొక్కలకే ఉందని చెప్పారు.అనంతరం అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బసా వెంకటస్వామి రెడ్డి, ఎంవివిపి ఆచారి,రుక్కల శ్రీనివాస్, రెడ్డిపల్లి ఆనంద్ కుమార్, కృష్ణమూర్తి, నాగరాజు, కామేష్, వీరబాబు, చంటి, ఎస్ శ్రీను, గగనం కాశీ విశ్వేశ్వరరావు, శంకర రెడ్డి, ఆర్మీ సతీశ్ తదితరులు పాల్గొన్నారు

కోయ భాష ఉపాధ్యాయులను నియమించాలి ఆదివాసి సంక్షేమ పరిషత్ డిమాండ్

విశాలాంధ్ర - చింతూరు : రంపచోడవరం చింతూరు ఐటీడీఏ పరిధిలో ఉన్న పాఠశాలలో కోయభాష ఉపాధ్యా యులను వెంటనే నియమించాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం ఆదివాసీ సంక్షేమ పరిషత్, కొయత్తోర్ బాట ఆధ్వర్యంలో చింతూరులోని ఎస్ఎంహెచ్ హాస్టల్లో పీసం దులయ్య ఆధ్వర్యంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆ సంఘ రాష్ట్ర ప్రచార కార్యదర్శి సోడీ మురళి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ, గిరిజన సంక్షేమ శాఖ కోయ బాష రక్షణ కోసం కృషి చేయాలని కోరారు. కోయత్తోర్ బాట ఆధ్వర్యంలో 2000 సంవత్సరము నుండి కోయ భాష పైన పద్యాలు కథలను కృషి వలన గుర్తింపు లభించిందని అన్నారు, కో యత్తోర్ బాట వారు ఆధ్వర్యంలో తయారు చేసినటువంటి పుస్తకాలను పద్యాలను, కథలను ప్రతి పాఠశాలలో బోధించే విధంగా ప్రణాళిక రూపొందించాలని అన్నారు. మాతృ భాష భోధకులను త్వరగా నియమించి పాఠశాలకు పంపించాలని, వారికీ గౌరవ వేతనం పై పునరా లోచించాలని సూచించారు. రంపచోడవరం, చింతూరు ఐ.టి.డిఏలలో మరిన్ని పాఠశాలకు వర్తించేలా కృషి చేయాలనీ పిలుపునిచ్చారు. జూలై 21 కోయ భాష దినోత్సవాన్ని గౌరవించి మాతృ భాష భోధకులను నియమించాలన్నారు . అలానే ఎపిపియస్‌సి ద్వారా గ్రూప్ 1 సోడి శ్రీవిద్య ఎంపిక కావడం వల్ల జాతి గర్విస్తుందని, మరింత మంది ఆదివాసీ యువతి , యువకులు చదువులలో రాణించి ఉన్నత శిఖరాలకు చేరాలని పిలుపునిచ్చారు ఈకార్య క్రమములో పీసం దూలయ్య కుంజా బాలకృష్ణ, పైడా ముత్తయ్య, సున్నం కన్నయ్య తదితర, తెల్లం కృష్ణ, మోసం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

సమస్య పరిష్కరించండి...వ్యాధులు వ్యాప్తి చెందకుండా చూడండి

విశాలాంధ్ర - చింతపల్లి : సిమెంటు రహదారిపై పేరుకుపోయిన మురుగునీటి నిల్వ సమస్యను పరిష్కరించి, దోమలు వృద్ధి చెంది వ్యాధులు వ్యాప్తి చెందకుండా పాలకులు, అధికారులు చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. మండల కేంద్రంలోని రామాలయం వీధికి చెందిన రాజమ్మ గరువు సమీపంలో సిమెంటు రహదారిపై నీరు నిలవ ఉండడంతో మురుగునీరుగా తయారై రాకపోకలకు ఇబ్బందికరంగా మారడమే గాక, దోమలు వృద్ధి చెంది వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని, ప్రస్తుతం గ్రామంలో దోమ కారక డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా తదితర వ్యాధులు విజృంభిస్తూ ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయని చింతపల్లి ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంటి పరిసరాలలో నీటి నిల్వలను తొలగించుకోవాలని అవగాహన కలిగిస్తున్న పాలకులు, అధికారులు నిత్యం రాకపోకలు సాగించే సిమెంటు రహదారులపై పేరుకుపోయిన మరుగు నీటి నిల్వలను తొలగించకపోవడంలో ఆంతర్యం ఏమిటని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

డంపింగ్ యార్డ్‌తో విద్యార్థులకు పొంచి ఉన్న ప్రమాదం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ఆవేదన

విశాలాంధ్ర - చింతపల్లి : చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో డంపింగ్ యార్డు తో విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉందని ఆ కళా శాల విద్యార్థులు ఆందోళన చెందు తున్నారు. మండల కేంద్రంలోని పుర వీధులలోని చెత్తను స్థానిక డిగ్రీ కళాశాల మైదానం సమీపంలో ఉన్న డంపింగ్ యార్డ్ వద్ద చెత్త నుండి సంపద కేంద్రం భవనం నిర్మాణం చేపట్టినప్పటికీ, పురవీధులలో సేకరించిన చెత్తను డిగ్రీ కళాశాల మైదానంలో పడవేయడమే గాక ఆ వ్యర్థాలకు నిప్పు పెట్టడంతో వ్యాపిస్తున్న పొగ వలన విద్యార్థిని, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పొగ పీల్చడం వలన ఊపిరి తిత్తుల సమస్యలతో పాటు శ్వాస కోస సంబంధ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని విద్యార్థులతో పాటు అధ్యాపకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ డంపింగ్ యార్డ్ డిగ్రీ కళాశాల మైదానానికి దూరంగా ఏర్పాటు చేసుకోవాలని కళాశాల విద్యార్థులు మల్లేశ్వరి, మీనాక్షి లతోపాటు పలువురు విద్యార్థులు స్థానిక ఎంపీడీవో ఆశాజ్యోతికి శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈ డంపింగ్ యార్డ్ వలన చెప్పుకోలేని సమస్యలతో సతమతమవుతున్నామని, ఇటువంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని డిగ్రీ కళాశాల మైదానం నుంచి డంపింగ్ యార్డ్‌ను డిగ్రీ కళాశాలకు దూరంగా ఏర్పాటు చేసుకునేందుకు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో ఆశాజ్యోతిని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వినతి పత్రం సమర్పించిన వారిలో కళాశాల విద్యార్థులు సంజీవి, రవి, సందీప్, జగన్‌లు ఉన్నారు.

నేడు సర్పంచు ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర - హుకుంపేట : శోభకోటలో సర్పంచు ఉప ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రిటర్నింగ్ అధికారి ఎస్ వి బాబుప్రసాద్, జోనల్ అధికారి ఎస్. సంజీవిరావులు పేర్కొన్నారు. శుక్రవారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ శోభకోట పంచాయతీలో సర్పంచు పదవి కోసం 4 వ్యక్తులు పోటీలో ఉన్నారని తెలిపారు. పంచాయతీ కేంద్రంలో పాఠశాల వద్ద మొత్తం 8 పోలింగ్ కేంద్రాలుకు 24 మంది సిబ్బందితో 19 తేది శనివారం ఉదయం 7గంటల నుంచి 1 గంట వరకు ఓటింగ్ నిర్వహిస్తామని రెండు గంటల నుంచి లెక్కింపు నిర్వహించి విజేతలను ప్రకటిస్తా మని తెలిపారు. శోభకోటలో మొత్తం 1319 ఓటర్లు తమ ఓటును వినియోగించుకుంటారని తెలిపారు. ఓల్డా, మతం పంచాయతీలలో రెండు వార్డు మెంబర్లు కు ఏకగ్రీవం కాగా అలాగే బారామోసి గ్రామంలో 3వార్డు ఎన్నిక నిర్వహిస్తామని 124 మంది ఓటర్లు తమ ఓటునీ వినియోగించుకుంటారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రూట్ ఆఫీసర్ ప్రదీప్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

వరద బాధిత కుటుంబాలకు టార్పాలిన్స్ పంపిణీ

విశాలాంధ్ర - వి.ఆర్.పురం : మండలంలోని వడ్డే గూడెం గ్రామపంచాయతీ పరిధిలోని ఒడ్డిగూడెం గ్రామం లో శబరి గోదావరి వరదల సమయంలో నీట మునిగిన వరద బాధిత కుటుంబాలకు, ఎంఎల్ఏ ధనలక్ష్మి ఎమ్మెల్సీ అనంతబాబు కృషితో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక తహసిల్దార్ పర్యవేక్షణలో శుక్రవారం వరద బాధితులకు కుటుంబాల వారిగా సంబంధిత వాలంటీర్లచే టార్పాలిన్స్ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రెటరీ స్వరూప రెడ్డి, సర్పంచ్ సోడి నరసమ్మ,ఉప సర్పంచ్ కోట్ల శ్రీనివాస్,బొడ్డు సత్యనారాయణ, సుమన్, ముత్యాల గౌతం, సుధీర్, ,వాలంటీర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ మారీటైం ఇండియా సమ్మిట్ 2023

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : కేంద్ర పోర్టులు నౌకాయాన , జలరవాణా మంత్రిత్వ శాఖ మరియు ఫిక్కి సంయుక్తంగా గ్లోబల్ మారీటైం ఇండియా సమ్మట్ 2023 థర్డ్ ఎడిషన్ ను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. అక్టోబర్ 17, 18, 19న ఢిల్లీలో భారీ ఎత్తున సమ్మిట్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అంతర్జాతీయ రీజనల్ భాగస్వామ్యాలను ఏర్పాటు చేయడం ద్వారా భారత నౌకాయాన వాణిజ్యాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లడమే ఈ సమ్మట్ యొక్క ముఖ్య ఉద్దేశ్యము. గ్లోబల్ మారీటైం సమ్మిట్ 2023, భారత అంతర్జాతీయ నౌకాయాన వ్యాపారులకు ఈ రంగంలో ఉన్న ఇబ్బందులు గురించి చర్చించడం, నూతన అవకాశాలను అవిష్కరించడం, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకట్టుకోవడం వంటి అంశాలను చర్చించేందుకు ఒక ప్లాట్‌ఫాంగా ఉపయోగ పడుతుంది. అక్టోబర్‌లో జరిగే గ్లోబల్ మారీటైం ఇండియా సమ్మిట్ 2023కు సన్నాహకంగా విశాఖపట్నం పోర్టు అథారిటీ ఈ నెల 23న విశాఖపట్నంలోని నోవాటెల్‌లో రోడ్ షోను నిర్వహిస్తోంది. ఇందులో షిప్పింగ్ ఏజెంట్లు, వ్యాపారులు, పోర్టు భాగస్వాములు, పిపిపి ఆపరేటర్లు, మారీటైం బోర్డు సభ్యులు, పాల్గొంటారు. రోడ్ షోలో భాగంగా మారీటైం సెక్టార్‌లో ఉన్న విస్తారమైన అవకాశాలను వారు చర్చించనున్నారు. ఆనంతరం అక్టోబర్‌లో ఢిల్లీలో మూడు రోజుల పాటు జరగనున్న సమ్మిట్ లో విశాఖపట్నం పోర్టు ఆధ్వర్యంలో వారంతా పాల్గొననున్నారు. ఢిల్లీలో జరిగే గ్లోబల్ మారీటైం ఇండియా సమ్మిట్ 2023ను ప్రధాని నరేంద్ర మోడీ లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో మారీటైం రంగంలో ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ది చెందిన పరిశ్రమ నిర్వాహకులు నిపుణులు పాల్గొంటారు. ఈ సమ్మిట్ లో విశాఖపట్నం పోర్టులో జరుగుతున్న అభివృద్ధి పనులు, భావిష్యత్తు ప్రణాళికలు, పోర్టు ప్రత్యేకతలు, పెట్టుబడుల అవకాశాలు, వ్యాపార అవకాశాలు వంటి అంశాలను వివరించేలా విశాఖపట్నం పోర్టు స్టాల్ ను ఏర్పాటు చేయనుంది. 23 ఆగస్టు 2023న విశాఖపట్నం పోర్టు అథారిటీ నిర్వహించే రోడ్ షో కు విస్తృతమైన ప్రచారం కల్పించవలసిందిగా పోర్టు యాజమాన్యం విజ్ఞప్తి చేస్తోంది.